ప్రజలంతా సంతోషంగా ఉన్నారు

- ప్రతిఇంటా పండుగ వాతావరణం
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



ముత్యాలంపాడులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొందని ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30, 31, 32 డివిజన్లకు సంబంధించి ముత్యాలంపాడులోని 211 వ సచివాలయంలో శనివారం పింఛన్ వారోత్సవాలు జరిగాయి. ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారులకు నూతన పింఛన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.2,750కి పెంచి.. రాష్ట్రంలోని అవ్వాతాతలు, దివ్యాంగులకు నూతన సంవత్సర కానుకగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీలు, మధ్యవర్తుల ప్రమేయం ఉండేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేస్తూ.. ప్రతినెలా ఒకటో తేదీ ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నట్లు చెప్పారు. 30వ డివిజన్‌లో 70 మందికి, 31వ డివిజన్లో 34 మందికి, 32వ డివిజన్లో 47 మందికి కలిపి మొత్తం 151 కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు మల్లాది విష్ణు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఓయూసీడీ కె.శకుంతల, జోనల్ కమిషనర్ జి.సుజనా, సీడీఓ జగదీశ్వరి, కార్పొరేటర్లు పెనుమత్స శిరీష , జానారెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, నాయకులు పెనుమత్స సత్యం, సామంతపూడి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

27వ డివిజన్ గులాబీతోటలో శనివారం పింఛన్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు కొండాయగుంట మల్లీశ్వరి, బాలిగోవిందు తో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత 27, 36వ డివిజన్లలోని పెన్షనర్లకు పింఛన్‌లను అందజేశారు. ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె. శివ, బి.గాంధీ, కె.బలరామ్ వంశీ, యర్రంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమ పాలనతో పేదలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 25వ డివిజన్‌లో 96వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలదేవితో కలిసి గడప గడపకు వెళ్లారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, మొహియుద్దీన్ రోడ్డు, దుర్గయ్య వీధి, జలీల్ ఖాన్ వీధి, జెండా వీధి, మసీదు వీధి, చింతావారి వీధి, యాసిన్ రోడ్డు సహా పలు వీధుల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. వీధుల్లో ప్యాచ్‌వర్క్‌లతో పాటు యూజీడీ సమస్య పరిష్కారానికి కొత్త లైన్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. ప్రజల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. నవరత్నాల పథకాల ద్వారా 96వ వార్డు సచివాలయ పరిధిలో రూ. 6.86 కోట్ల సంక్షేమాన్ని మూడున్నరేళ్లలో అందజేసినట్లు మల్లాది విష్ణు తెలిపారు.

చంద్రబాబే అసలు సైకో

ప్రజా శ్రేయస్సు కోసమే తమ ప్రభుత్వం జీఓ నెం.1 తీసుకొచ్చినట్లు మల్లాది విష్ణు తెలిపారు. కనీసం జీవోలో ఏముందో కూడా తెలుసుకోకుండా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నిస్సిగ్గుగా మాట్లాడుతున్న చంద్రబాబే నిజమైన సైకో అని విమర్శించారు. చంద్రబాబును సభలు పెట్టుకోవద్దని ఎవరూ చెప్పలేదని.. ఇరుకైన ప్రాంతాలలో మాత్రమే సభలు వద్దని పోలీసులు సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, జోనల్ కమిషనర్ జి.సుజనా, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్, నాయకులు బంకా భాస్కర్, నాగేశ్వరరెడ్డి, బంకా బాబి, షేక్ రఫీ, అబ్దుల్ లతీఫ్, అలీ అన్సారీ, భోగాది మురళి, వి.బి.ఆచారి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి ఎంత ప్రాధాన్యం ఇస్తుందో, అభివృద్ధికి అంతే ప్రాధాన్యత ఇస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ శాంతినగర్‌లో రూ.15.35 లక్షల వ్యయ అంచనాతో నిర్మించే శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవన నిర్మాణం పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 8 డివిజన్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశామని.. పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 21 డివిజన్ల పరిధిలో ప్రస్తుతం 13 వందల మంది పారిశుధ్య కార్మికులు, 21 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఏఎంఓహెచ్‌లు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మూడున్నరేళ్ల కాలంలో రూ. 13.19 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు, వాటిలో 5.51 కోట్ల పనులు పూర్తికాగా, రూ.4.81కోట్ల పనులు వివిధ దశలలో ఉన్నాయని, మరో రూ.2.87 కోట్ల పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, నాలం బాబు, అలంపూర్ విజయ్, మోదుగుల గణేష్, ఆర్ఎస్ నాయుడు, అనిల్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ కళాపీఠం సేవలు ఆదర్శం



సరస్వతీ కళాపీఠం నిర్వహించిన సభలో కవులు, గాయకులు, వివిధ రంగాల ప్రముఖులు

విజయవాడ కల్చరల్: శ్రీ సరస్వతీ కళాపీఠం సంగీత సేవలు ఆదర్శంగా తీసుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ సరస్వతీ కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం స్వర–రాగ–సుధ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నృత్యం భగవదత్తమైన వరాలని వాటిని కాపాడుకోవాలని కళా సంస్థలకు సూచించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నగరం సంగీత సాహిత్యాలకు వేదికగా నిలుస్తోందన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు మధిర రోజా ప్రసన్నత, పీసుపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి పాల్గొన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం నుంచి వచ్చిన సీనియర్ గాయకులు విజయకుమార్, మాధవి, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది సూర్యకామేశ్వరి, ఉమాబలరాం, డాక్టర్ స్వర్ణకుమారి, మాడుగల రామకృష్ణ, బీహెచ్ కామేశ్వరి, మల్లిక్ మోదిని పలు గీతాలు గానం చేశారు. గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

ముగిసిన ఫస్ట్ ఎయిడ్ శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ప్రొటెక్షన్‌ఫోర్స్ డైరెక్టర్ జనరల్ సంతోష్‌మెహరా, విజయవాడ జోన్ కమాండెంట్ డాక్టర్ కేఎస్‌రావు ఉత్తర్వుల మేరకు ఏపీఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంకేవీఎస్ గుప్తా ఆధ్వర్యాన ఎస్‌పీఎఫ్ సిబ్బందికి నాలుగురోజుల పాటు ఫస్ట్ ఎయిడ్ శిక్షణ జరిగింది. ముత్యాలంపాడులో ప్రాథమిక చికిత్సపై తరగతులు నిర్వహించి ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. ఏపీఎస్‌పీఎఫ్ గార్డ్స్ సిబ్బంది తరపున అసిస్టెంట్ కమాండెంట్ గుప్తా శనివారం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ విఠల్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సిబ్బంది 304 మందికి శిక్షణలో పూర్తి సహాయ సహకారాలు అందజేసినందుకు ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ తరుపున అభినందనలు తెలిపారు.

కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కాల్వలు శుభ్రంగా ఉంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం 64వ డివిజన్ విలేజి కండ్రికలో ఆమె పరిసరాలను పరిశీలించారు. కాల్వల్లో వ్యర్థాలను పరిశీలించి తొలగించాలని సూచించారు. ప్రజలు చెత్తను కాల్వల్లో వేయకుండా డస్ట్‌బిన్‌ల్లో వేయాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సామాజిక బాధ్యతని తెలిపారు. ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారానికి సంబంధించిన వివరాలను రికార్డులో పరిశీలించారు. తనిఖీల్లో స్థానిక కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, డాక్టర్ షేక్ బాసిద్, వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, అక్కిశెట్టి నారాయణ, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యంపై ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని పూర్ణానందంపేటకు చెందిన యువతి(20) ఇంటి వద్దే ఉంటు దూర విద్య ద్వారా డిగ్రీ చదువుతోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసినవారు, బంధువుల వద్ద వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఎస్ఎన్ పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు గోదా రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన ధనుర్మాసం విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆంజనేయుడికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఈఓ నాగినేని భవాని, ధర్మకర్త మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

రేపు గోదా రంగనాథుడికి ముత్యాల హారతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన సోమవారం తెల్లవారుజామున గోదా రంగనాథుడికి ముత్యాల హారతులు ఇవ్వనున్నట్లు పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి తెలిపారు. ముత్యాలంపాడులోని మందిరంలో శనివారం మీడియా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ భక్తులు స్వయంగా లక్ష్మీదేవికి ప్రీతికరమైన హారతులను రంగనాథుడికి సమర్పించి ఆయురారోగ్య ఐశ్వర్యం పొందాలని కోరారు. సమావేశంలో పారాయణ మండలి సభ్యులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ



కంపోస్ట్‌ను విక్రయిస్తున్న వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారి డాక్టర్ రత్నావళి

పటమట(విజయవాడతూర్పు): సేంద్రియ ఎరువుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, పంటలు, మొక్కలు ఈ ఎరువులతో పరిపుష్టిగా దిగుబడిని అందిస్తాయని వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారి డాక్టర్ రత్నావళి అన్నారు. వీఎంసీ, హరితప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగే ఆరో రాష్ట్ర స్థాయి అగ్రికల్చర్ షో, ఐదో వార్షిక గులాబీ ప్రదర్శనలో వీఎంసీ సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం కోసం 74 వ స్టాల్ ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో నగరంలో లభించే తడి వ్యర్థాలను సేకరించి వర్మీకంపోస్ట్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చే కంపోస్టింగ్ విధానంపై ప్రదర్శనకు వచ్చేవారికి అవగాహన కలిగించామన్నారు. ఈ ప్రదర్శనలో ఇప్పటివరకు కేజీ. రూ 10 చొప్పున 224 కేజీల వర్మీకంపోస్ట్ ఎరువును వీఎంసీ విక్రయించిందని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్–1 ఒబేస్వర రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు అపూర్వం



బహుమతులను అందజేస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలో అపూర్వమైన స్థానముందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేబీఎన్, వాసవి షైన్ విజయం సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరుతో ముగ్గుల పోటీలను కళాశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బహుమతీ ప్రదానంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సంక్రాంతి అంతర్భాగమే అన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టి.శేషయ్య, తూనుకుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతిపై అవగాహన కలిగించడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభాధ్యక్షుడు ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ తమ కళాశాలలో వారం ముందుగానే సంక్రాంతి హడావుడి ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ కష్ణవేణి, లక్ష్మీప్రసన్న క్లబ్ అధ్యక్షురాలు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. కేటీ రోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజు డేవిడ్ అధ్యక్షత వహించగా, 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, బోయి సత్యబాబు, విజయవాడ వెస్ట్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సౌత్ సెంట్రల్ రైల్వేస్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎం. మధుబాబు, 48వ డివిజన్ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు తదితరులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వణుకూరులో జగనన్న లేఅవుట్ల పరిశీలన



వణుకూరులో జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలసి వణుకూరు 1, 2, 3 జగనన్న ఇళ్ల లేఅవుట్లలో ఇప్పటి వరకు పూర్తైన ఇళ్లను పరిశీలించారు. జరగాల్సిన గృహ నిర్మాణ పనులు, మౌలిక వసతులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం జరిగిన పర్యటనలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ లేఅవుట్‌లో 24 గంటలూ కరెంటు ఉండటానికి త్రీ–ఫేస్ విద్యుత్ ఏర్పాటు చేయాలని, రోడ్లు, తాగునీటి వసతిని నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఆర్‌డీఏ ఈఈ ప్రవీణ్ కుమార్, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్ టి.శ్రీనివాసు, హౌసింగ్ డీఈ విజయ్ బాబు, కాంట్రాక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షకు పటిష్ట బందోబస్తు

డీసీపీ విశాల్‌గున్ని



ఆంధ్రా లయోల కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని 13 విద్యా సంస్థల్లో ఈ నెల 8వ తేదీ ఆదివారం జరిగే గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్‌గున్ని తెలిపారు. నగరంలోని బిషప్ అజరయ్య పాఠశాల, ఆంధ్రా లయోల కళాశాలలో జరిగే పరీక్ష ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. భద్రత దృష్ట్యా పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ప్రింటింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ షాపులను మూసివేస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభ్యర్థులు సెల్ ఫోన్‌లు, ఇతర విలువైన వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఏసీపీ ఖాదర్‌బాషా ఉన్నారు.

సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సొసైటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో శనివారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో సేవలు అందించడానికి సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడం, తోటి వారికి సేవలు అందించాలని సూచించారు. అనంతరం బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ గౌరవ అధ్యక్షులు కొల్లూరి, అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సహాయ కార్యదర్శి వీరంకి గోకర్ణేశ్వరరావు,సభ్యులు మహబూబ్ జానీ పటాన్‌తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహనకు టీల్ కలర్ ప్రదర్శన



అయోధ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద టీల్ కలర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కలిగించడానికి ఆరోగ్య కేంద్రాల వద్ద టీల్ కలర్(ఆకుపచ్చ నీలిరంగు కలిసిన)ను ప్రదర్శిస్తున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాలను అనుసరించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రాజెక్టు టీల్ వాల్‌పోస్టర్లు, టీల్ కలర్ పెయింటింగ్, లైటింగ్ ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా తొలుత నగరంలోని అయోధ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద టీల్ కలర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ టీల్ కలర్ ప్రదర్శన ద్వారా క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కలిగించడమే కాకుండా, తొలిదశలో గుర్తించి పూర్తిగా కోలుకునేలా చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అయోధ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసినితో పాటు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, డీపీఎం డాక్టర్ నవీన్, ఆర్‌బీఎస్‌కే సమన్వయ అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రత్యూష, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో నూతన ఒరవడి



విద్యార్థులతో ఎమ్మెల్యే విష్ణు , డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థలో నూతన ఒరవడి ప్రారంభమైందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక అయోధ్యనగర్‌లోని శ్రీ శారదా విద్యా నిలయంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. 38 మంది 8వ తరగతి విద్యార్థులకు డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, పాఠశాల డైరెక్టర్ కొల్లూరి శ్రీనివాసచక్రవర్తిలతో కలిసి ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 'థ్యాంక్యూ జగన్ మామ' అంటూ చిన్నారులు చేసిన జేజేలతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొల్లూరి శ్రీనివాసచక్రవర్తి, నాయకులు గుండె సుందర్ పాల్, శ్రీను, జె.వెంకటేశ్వర రెడ్డి, శ్యామ్, పేరం త్రివేణి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. సురక్షితం..



వాహనచోదకులకు శిరస్త్రాణం.. శిరోధార్యమని నిబంధనలు చెబుతున్నాయి. ఈ చిత్రం చూడండి.. వాహనచోదకుడు తను హెల్మెట్ ధరించడమే కాకుండా.. బడికి తీసుకెళ్తున్న తన పిల్లలతో కూడా హెల్మెట్ ధరింపజేసి సురక్షిత ప్రయాణం చేస్తున్న దృశ్యం నున్న శివారు ప్రాంతంలో కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

యువతకు 'స్ఫూర్తి'







ఆంధ్ర లయోల కళాశాలలో స్ఫూర్తి–2023 కల్చరల్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఎత్నిక్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వివిధ వస్త్ర సంప్రదాయాలను వివరిస్తూ విద్యార్థులు ర్యాంప్ వాక్ చేశారు. గుజరాతీ, పంజాబీ, మరాఠీ , తెలుగు సంప్రదాయాలను ప్రతిబింబిచేలా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటుచేశారు. విద్యార్థులు సెల్ఫీలు దిగి, కేరింతలు కొట్టారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ